

# శ్రీలక్ష్మీ శతకము

## చొప్పకట్ల (దుద్యాల) హరిణి

**https://harini.choppakatla.com**

**harini.choppakatla@gmail.com**

# శ్రీలక్ష్మీ శతకము

1. శ్రీకరమౌ నీ గాథలు
శ్రీకరమౌ శతకమువలె సిద్ధింపగనే
శ్రీకరివౌ నిన్ను గొలిచి
శ్రీకారముతో వెడలితి శివకరి లక్ష్మీ!!

2. భావోద్వేగము గలుగగ
భావములన్నియు ముదమగు పద్యము రీతిన్
పావనమాలలు గూర్చుచు
కైవల్యము గోరు వారు కవులే లక్ష్మీ!!

3. భువనాభినుతాచారిణి
భువనైక సరస సురస ప్రఫుల్ల సునయనీ
భవచక్రమ్ములహారిణి
కవనవికాసిని యులూకగామిని లక్ష్మీ!!

4. ప్రణవాకారిణి సంతత
ప్రణుత జనరక్షిణి విమల పాలిని జననీ
గుణగణ నిధిరూపిణి ఘన
ప్రణిపాతము జేతు తల్లి పద్మా లక్ష్మీ!!

5. తనువున యీర్ష్యా ద్వేషము
కనులకు దెలియక గలుగగ కలిమాయలచే
మనుగడ యందున ధర్మము
కనుమరుగవ్వగ నరయుమ కమలా లక్ష్మీ!!

6. శుభముల నొసగుచు బ్రోచెడి
శుభదాయినిగ నిను గొలచి శోభను గూర్చిన్
విభవముల కొరకు వేడగ
నభమున నలరెడి రమణిగ ననుగను లక్ష్మీ!!

7. పాపము పుణ్యము నెరుగను
నాపాలిటి జనని వనుచు నమ్ముచు నిన్నే
నే పలుకుచు నీ నామము
నీ పదములనే కొఅలితి నిరతిని లక్ష్మీ!!

8. పూనుచు త్రిసంధ్యలందున
మానసమున నిను నిలుపుచు మరిమరి దలచిన్
నానా గతులను మరచుచు
తానకముగ నిన్ను గోరు దాసిని లక్ష్మీ!!
(తానకము: కచ్చితము)

9. సింధుజ నాదిని భైరవి
బాంధవి వాగ్దేవి హరిణి భగవతి దేవీ
సైంధవి మోహిని శుభ శర
సంధాయిని గుణగణనిధి శార్వరి లక్ష్మీ!!

10. నారదమునీంద్రులు సలుపు
తారకమౌ నీ స్మరణము తాదాత్మ్యమునన్
ధారగ సలిపెద నిరతము
దార జెడక చారుమోము దలచుచు లక్ష్మీ!!
(దార: క్రమము)

11. పారాణి దిద్ది నడరెడి
నారాణీ నీ పదముల నయమగు విధమున్
క్షీరాభిషేకము సలిపి
నోరార నిన్ను నుతింతు నోముగ లక్ష్మీ!!

12. మెలకువ నిద్రావస్థను
వలనుగ నిన్నే దలంచి పయనము సలిపిన్
నిలలో పరమగు నిన్నే
ఫలముల గోరక కొలచెద వరముల లక్ష్మీ!!
(వలను : దిక్కు)

13. లక్ష్మీ! శ్రీధర మహిషీ
లక్ష్మీ! మునిగణ సురగణ రక్షిణి హరిణీ
లక్ష్మీ! కల్మషహారిణి
లక్ష్మీ! సలలిత సునయన రంజని లక్ష్మీ!!

14. సర్వోపనిషద వాసిని
సర్వాంతర్యామిని హరిసఖి వాగ్దేవీ
సర్వాలంకార భూషిణి
సర్వేశసతీ శరాంగి సద్గుణ లక్ష్మీ!!

15. రాజిత రంజిత రజనీ
జాజులు మల్లెలు గులాబి చామంతులనే
తాజారీతిని నేగొని
బూజను సలిపెద ముదమున పొలుపుగ లక్ష్మీ!!
(పొలుపుగ: సొంపుగ)

16. రామ్మా వారిజ లోచని
రామ్మా జననీ గుణనిధి రామ్మా దేవీ
రామ్మా పద్మనివాసిని
రామ్మా యని బిలువగ నిను రామ్మా లక్ష్మీ!!

17. లాలించుచు బిడ్డల వలె
నాలింపుమ మా వినతులనన్నీ లక్ష్మీ
పాలింపుమ జనులందరి
యేలికవై మము నరయుమ హేలగ లక్ష్మీ!!

18. మాలిని శంఖిని చక్రిణి
నాలో దైత్యగుణమ్ముల నణచుమ తల్లీ
త్రైలోక్య జనని భార్గవి
నాలో నిలువుమ ముదమున నరహరి లక్ష్మీ!!
(పూజ్య గురువులు బ్రహ్మశ్రీ చాగంటి వారు)

19. చాగంటి గురుని పలుకులు
యాగంబుగ దలచి వినుచు ననివరతమునే
సాగించితి నా పయనము
నా గమ్యము నీ వనుచును నయముగ లక్ష్మీ!!

20. నీవే గురువిణి నేస్తము
నీవే జననీ జనకుడు నెలవూ నీవే
నీవే దైవము భావము
నీవే గమ్యము గమనము నిజమిది లక్ష్మీ!!

21. (పూజ్య గురువులు బ్రహ్మశ్రీ సామవేదం వారు)
ధర్మము నందలి ఘనమగు
మర్మములను దెలుపుచు కడు మమతను జూపిన్
శర్మ గురువర్యులు బలుకు
కర్మ పథమ్మున నిలచితి కపిలా లక్ష్మీ!!

22. కోలాసుర వధను సలిపి
కోలాపురమున నడరుచు కోర్కెలు దీర్చిన్
హేలను గూర్చుచు ముదమున
పాలన జేయుమ జననిగ పావన లక్ష్మీ!!

23. ధవళము వదనము హసితము
ధవళపు వన్నెల చెలువల ధారిణి నీవే
ధవళపు యులూక గామిని
ధవళపు మదినిడి నడుపుమ తల్లీ లక్ష్మీ!!

24. కలహంస నడక సొగసుల
జిలుగుల సొబగుల మెరుపులు జిందుచు నీవే
గలగల సవ్వడి జేయుచు
కలమున  నిలువవె పదముల గనిగా లక్ష్మీ!!

25. (ఆదిలక్ష్మి)
నాదస్వరూపిణి విమల
మాధవి మునిగణ సురగణ మంగళవినుతా
యాది జననిగ మము గనుచు
నీదౌ పథమున నడుపుమ నిరతిని లక్ష్మీ!!

26. (ధాన్యలక్ష్మి)
మంగళరూపిణి కామిని
మంగళదాయిని సురనుత మంత్రనివాసీ
పొంగెడి ధాన్యపు రాశిగ
మంగళమౌ రీతి నిలువుమమ్మా లక్ష్మీ!!

27. (ధైర్యలక్ష్మి)
కార్యములందున ఘనముగ
వీర్యరసమొసంగుచు కడు ప్రేమను జూపిన్
స్థైర్యము తోడను సాగను
ధైర్యమొసంగుచు నడుపుమ దయగల లక్ష్మీ!!

28. (గజలక్ష్మి)
జగములనేలెడి నిధిగా
ధగధగ శోభల నడరుచు ధనమును గూర్చిన్
వగపును దీర్చెడి జననిగ
యుగముల నన్నింట నీవె యుండుమ లక్ష్మీ!!

29. (సంతానలక్ష్మి)
సంతతి నొసగుచు జనులకు
సంతసమును గూర్చు జనని సౌజన్యమయీ
సంతతము నిన్ను దలువగ
పంతము సేయక మముగను పద్మా లక్ష్మీ!!

30. (విజయలక్ష్మి)
గజములు నుతించు జననిగ
భజనలు సలుపుచు ముదమున పరవశమొందిన్
నిజమగు భక్తిని జూపగ
విజయము నిడువుమ నిరతము ప్రీతిగ లక్ష్మీ!!

31. (విద్యాలక్ష్మి)
ఆద్య సఖీ పరమేశ్వరి
పద్య శతకమును లిఖింప భావము నీవై
విద్యల నొసంగుచు నడుపు
ఆద్యంతము నను ముదమున హాయిగ లక్ష్మీ!!

32. (ధనలక్ష్మి)
ఘనముగ సేవలు జేయుచు
జనులందరు నిను నుతింప జక్కని రీతిన్
ధనమునొసంగెడి జననిగ
గనుమము సతతము నరయుచు కాంచన లక్ష్మీ!!

33. కందము నందున బూనితి
ఛందము దెలియక పరమగు శతకము వ్రాయన్
చందము గూర్చెడి పలుకుల
కుందంబుగ నిలువుమమ్మ కరుణా లక్ష్మీ!!

34. జపముల యాగంబులు ఘన
తపముల సలుపుచు నిరతము తామసములచే
చపలము జూపుచు మిక్కిలి
కపటము జూప ఘనతేమి కమలా లక్ష్మీ!!

35. క్షీరాబ్ధితనయ మంగళ
ధారాధర హరిసఖియగు తామస హారీ
నారాయణి పరమేశ్వరి
ధారగ పదముల నిడువుమ తల్లీ లక్ష్మీ!!

36. లక్ష్మీ యను నామంబును
లక్ష్మముగా దలచి బలుక లాలిత్యముగా
లక్షించుచు మము గావుమ
యక్షయముగ సిరులొసంగి నలరుచు లక్ష్మీ!!
(లక్ష్మము:ముఖ్యము)

37. అందెల గజ్జెల మ్రోగగ
చిందులు వేయుచు ప్రియమగు సిరిగా రామ్మా
నందముతోడను నామది
వందనములిడువగ రామ్మ భార్గవి లక్ష్మీ!!

38. కారణము చేత జన్మము
కారణమౌ బంధమందు కైవల్యమునే
భారమనగ దయచే నిను
జేరెడి పథమున నిలుపుమ శ్రీహరి లక్ష్మీ!!

39. పంచేంద్రియముల నణచుచు
పంచమమౌ నీ తలపున పరవశమొందిన్
వాంఛలనన్నియు మరచుచు
లాంఛనముగ నిను గొలచెద లలితా లక్ష్మీ!!
(పంచమము: ఇంపు)

40. చపలము నందున జేసిన
కపటంబులు దోషములను గానక విడచిన్
అపకారిగ నిలచిన నను
యుపకారిగ జేయు తల్లి యోగిని లక్ష్మీ!!

41. క్రతువులు సేయగనేలా?
వ్రతమ్ములుపవాసమేల? భక్తిగ నిన్నే
సతతము దలువగ ముదమున
జతనము లభియించు గాద జలధిజ లక్ష్మీ!!

42. యొకపరి నిన్నే దలువగ
వికారములు దొలగి సకల విద్యలనందున్
ప్రకటితమౌనే జ్ఞానము
చకితములన్నియు దొలగుచు సత్కళ లక్ష్మీ!!
(చకితము: భయము)

43. లలితము నయనము, వదనము
లలితము పలుకులు హసితము లలితములన్నీ
లలితము నీ నామ జపము
లలితములౌ నీ పదములు లలితా లక్ష్మీ!!

44. మరువను ధ్యానము స్మరణము
మరువను జపములు తపములు మరువను నిన్నే
మరువను వరముగ నొసగిన
పరమగు కవితా శరమును భావనలక్ష్మీ!!

45. కపటము తోడను బూజను
టపటపమని సలుప జనులు టక్కరి రీతిన్
అపరాధము మన్నించుచు
కపటత్వము దొలగజేయు కాంచన లక్ష్మీ!!

46. నీ నామము శుభకరమౌ
నీ నామము దొలగజేయు నేరములన్నీ
నీ నామమె నా స్వర్గము
నీ నామమె దలచుకొందు నిరతిని లక్ష్మీ!!

47. నీ స్మరణమె నా రక్షయు
నీ స్మరణమె నాకు దక్ష నిజమిది జననీ
నీ స్మరణమె నా గమనము
నీ స్మరణమె గమ్యము మరి నిక్కము లక్ష్మీ!!
(దక్ష: వృద్ధినొందుట, నేర్పరి యగుట)

48. కోరను భవసుఖములనే
కోరను యశమును బదవిని కోరక సిరులే
గోరెద నీపై నిరతిని
గోరెద నీ చరణములను కువలయ లక్ష్మీ!!

49. మణిమయ ద్వీపమునందున
మణిమయ రాశుల నడుమను మరులను గొలిపే
మణివౌ రాణిగ నడరుచు
గణముల వినతులను గొనుమ గరిమల లక్ష్మీ!!

50. కనకధరా స్తోత్రమ్మును
గనకయు కష్టములనెపుడు గాంచుచు నిన్నే
కనకమ్ములు గోరి గొలువ
కనకమ్ముల ధార కురియు గాంచన లక్ష్మీ!!

51. తులసిగ నిన్నే ప్రియముగ
నిలుపుచు గృహమున గొలువగ నిత్యము జననీ
గలుగును పరమౌ సుఖములు
చలువగ మము గావ నీవు సద్గుణ లక్ష్మీ!!

52. రావే శ్రీకరి శుభకరి
రావే శ్రావణము నందు రమణీ రావే
ఆవేదనలను దీర్చుచు
గావగ ముదితలను రావె కాంచనలక్ష్మీ!!

53. పరమగు నిన్నే గొలువగ
వరములొ సంగెడి జననిగ భక్తిని జూపిన్
గరిమను జూపుచు రామ్మా
కరిసేవల నందు జనని కరుణా లక్ష్మీ!!

54. చుక్కల ఱేడుకి ప్రియమగు
చక్కని జెల్లెల నడుపుమ చక్కని రీతిన్
జిక్కని భావమ్ములనిడి
జక్కని శతకమ్ము నిడుమ సత్కళలక్ష్మీ!!

55. నిరతము భక్తిని జూపుచు
స్మరియించెద ముదమున నిను చదువుల కొరకై
విరచించెద నీ గాథలు
తిరమౌ నీ గారవమును దెల్పెచు లక్ష్మీ!!

56. నీకన్నను ప్రియమెవ్వరు
నీకన్నను లేరు నాకు నేస్తములెవరున్
నీకై కొలుచు నిరతము
నీకై బ్రతుకుదు కడకిట నిక్కము లక్ష్మీ!!

57. ఎందున్నను నిను మరువక
అందందే నిన్ను గనుచు ననివరతమునే
నందంబుగ నిన్ను దలచి
కందంబులు వ్రాతు తల్లి కవితా లక్ష్మీ!!

58. ఆచారమ్ములనన్నియు
నే చోద్యమనక నిరతము నిరతిని జూపిన్
నీ చరణమ్ముల గోరుచు
నే పాలించెద ముదమున నిక్కము లక్ష్మీ!!

59. తల్లీ! శ్రీధర ప్రియసఖి
యుల్లాసంబున గొలువగ యుక్తిని గూర్చిన్
చల్లగ సతతము గావుమ
కల్ల కపటములను వీడ కరుణను లక్ష్మీ!!

60. సత్కవితలనొసంగుచు
సత్కవులకెల్ల నెలవుగ సత్పథముననే
సత్కళతోడను నడిపెడి
సత్కళన నడరు సలలిత సద్గుణ లక్ష్మీ!!

61. శ్రీవేంకటగిరి యందున
శ్రీవేంకటపతి సతివలె చెలఁగున నిలిచిన్
మా వెతలన్నియు దీర్చుచు
మా వేల్పుగ నిలచినట్టి మంగా లక్ష్మీ!!

62. రేయీ పగలని దలువక
హాయిని మరచుచు లిఖింప యనవరతమునే
జేయిని బట్టుకు నడుపుమ
సాయమొసంగుచు ఘనమగు శక్తిగ లక్ష్మీ!!

63. గురువులు జూపినపథమున
పరమగు నిన్నే దలచెడి భక్తినొసగుచున్
పరమతమును గోరక హిత
కరమౌ నీపథము నిలుపు కరినుతలక్ష్మీ!!

64. సాంకేతిక విజ్ఞానము
సాకారము జేసి మనిషి సాగగ ముదమున్
ఆకారము లేని మనిషి
చకచక భావముఁ మసలెను జగతిని లక్ష్మీ!!

65. క్షీరాన్నము పాయసములు
గారెలు దద్ధ్యోజనమును కమ్మని పులుసున్
బూరెలు బొబ్బట్లు ఘృతము
హారతితోనిడగ గొనుమ హాయిగ లక్ష్మీ!!

66. జాజులు, మల్లెలు, గజ్జెలు
గాజులు కుంకుమ పసుపును కాటుకగొని నే
మోజుగ శోభను గూర్చియు
రాజిలు నిన్నే గొలచెద రాణిగ లక్ష్మీ!!
67. ధరణిగ సతతము జనులకు
తరగని వనరులనొసగుచు తరతరములుగా
బరువని దలువక ముదమున
నరయుచు మము గనెడి తల్లి నరహరి లక్ష్మీ!!

68. గణములనందరి నేలెడి
గణపతిని దలచి ముదమున కైమోడ్పిడుచున్
గణములు, ప్రాసలు, యతులను
గుణములు సద్బుద్ధి నొసగ గోరెద లక్ష్మీ!!

69. అందమునంతయు పోసగుచు
కుందనపు ప్రతిమగ భవ్య కులకులతోడన్
చిందులు వేయుచు రాజిలు
కందమొసంగెదను నీకు కానుక లక్ష్మీ!!

70. కోరిక మీఱ నుతింపను
కోరితి నే భావఝరులు కోకొల్లలుగా
సౌరభము జిందు రీతిని
సారవంతమగు పదములిడు సద్గుణలక్ష్మీ!!

71. చరణమ్ములు భక్త జనుల
శరణమ్ములు శోఖహరణ సదనములవియే
హరణమ్ములు జనన మరణ
భరణమ్ములు లోకవినుత భార్గవి లక్ష్మీ!!

72. (దీపలక్ష్మి)
దీపమునందున నడరుచు
పాపములన్నియు హరించు పావనజననీ
తాపమునంతయు దీర్చుచు
నీ పథమున నను నడుపుమ నిరతిని లక్ష్మీ!!

73. జయదాత్రీ ధనదాత్రీ
జయంకరి సకల శుభకరి సౌభాగ్యకరీ
భయనాశకరీ సకల వి
జయకరి శ్రీకరి దినకరి సౌమ్యా లక్ష్మీ!!

74. భాగ్యపయోనిధి భార్గవి
భోగపయోరాశి సకల భువనాధారీ
యోగ్య పథవిదాత జనా
రోగ్య వరప్రదాయి విమల రోచన లక్ష్మీ!!
(రోచన: ఎర్రకలువ)

75. జయజయ జగధీశసఖీ
జయజయ శివసోదరి సిరి జయలక్ష్మి నమో
జయజయ జితకమలాసని
జయజయ మణిదీవి వాసి చక్రిణి లక్ష్మీ!!

76. లాక్షాలక్షిత మోహన
లక్షణ మృదుకోమల పద లాలిత జననీ
రక్షణ నిడుచుచు సతతము
సాక్షాత్కారము నొసగుమ సంధ్యాలక్ష్మీ!!

77. మంజుల ఘన మణిహారిణి
మంజుల మధుహాసిని సిరి మాధవి హరిణీ
మంజికభంజని రమణీ
కంజములనుగొని గొలుతును కాంచనలక్ష్మీ!!
(మంజిక: భయము)

78. లావణ్య కోమలాంగీ
ప్రావగ కొలువగ నిరతము పాహీ యనుచున్
ప్రావీణ్యము నొసగుచు నను
గావగ రావమ్మ భవ్య భావని లక్ష్మీ!!

79. శ్రీవత్సాంకిత రమణీ
శ్రీవత్సస గోత్రమందు శ్రీధర సతినై
కైవల్యము గోరి సతము
సేవలు జేయంగ గనుమ శ్రీసతి లక్ష్మీ!!

80. తెలుగింట బుట్టి దిరుగుచు
తెలుగున పద్యమ్ములేల తెలుగేలనుచున్
పలికెడి వారికి ముదమున
తెలుగునయున్నట్టి తీపి తెలుపుమ లక్ష్మీ!!

81. పద్యము, గద్యము, ఛందము
పద్యమునందలి మధువును పాటవములనే
హృద్యమగు రీతి నేర్పిన
పద్యగురునికిడెద నేను ప్రణతులు లక్ష్మీ!!

82. అమ్మా! భార్గవి! వైష్ణవి!
సమ్మానంబును సలుపగ శతకము తోడన్
నెమ్మనమున నిలువుమ ఘన
సమ్మోదంబును దెలుపుచు శౌరీ లక్ష్మీ!!

83. లక్ష్మీ నీ నామమహిమ
సాక్షాత్కారమ్ము సేయ శక్యమ దేవీ?
లక్షల పద్యములందున
నక్షరముల జూప తరమ యంబుజ లక్ష్మీ!!

84. పేషణ జేయుచు మేధను
పోషణనిడి ప్రాస యతుల భోగముతోడన్
తోషణమందున ఘనపద
భూషణములనొసగ గొనుమ పుష్టిగ లక్ష్మీ!!

85. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన
మిన్నగ యాశీస్సులిడుచు మేలునొసగుచున్
దన్నుగ నిలువగ శతకము
చెన్నుగ వ్రాసితి ముదమున శ్రీసతి లక్ష్మీ!!

86. పోతనరీతిని వ్రాయుచు
భూతలమున సంతతమ్ము భువనేశ్వరివౌ
నీతలపున నా మనమును
సంతసమున నిలుపుమమ్మ సజ్జితలక్ష్మీ!!

87. వరకరి శివకరి శుభకరి
సిరినగవుల సిత సొగసుల శివమును గూర్చిన్
మరిమరి ముదమున నతులిడ
మరువక నను గను హరిసతి మాతా లక్ష్మీ!!

88. కలువల రీతి విరిసి కడు
కలకలమును జేయు నట్టి కనులను జూసిన్
గలగలమని భ్రమరమ్ములు
నలికమున నిలిచె ముదమున నంభుజలక్ష్మీ!!
(అలికము: నుదురు)

89. శంఖముల భంగి కంఠము
శంఖధరుండు గనుచు కడు సౌహార్దముచే
శంఖమునందున్న విమల
శ్రీఖండము వ్రాసె నీకు సేవగ లక్ష్మీ!!

90. ముదితలు నిరతము గొలిచెడు
పదములె పరమగు పరమిడు పదములు దేవీ
ముదమున మురహరి గొలిచెడి
పదముల నిలువను నడచితి పద్మిని లక్ష్మీ!!

91. పూర్ణమగు కుంభము బగిది
పూర్ణిమ కౌముది చలువల పొలుపుగ నడరే
స్వర్ణ వదనమును గాంచుచు
వర్ణము జేసెద ప్రియముగ వరమని లక్ష్మీ!!
(వర్ణము: స్తుతి)

92. పూర్ణమగు కుంభముల వలె
స్వర్ణమయపు కాంతినడరు స్తనముల ఘనమౌ
వర్ణన జేసెద నే సం
పూర్ణముగ వసుధ గాచు శక్తిగ లక్ష్మీ!!

93. అభయ వరదముల కరముల
నభయమొసంగుచు నిరతము నరులను బ్రోచిన్
విభవములిడుచుచు నరయుమ
ప్రభవతి భగవతి శివకరి పద్మిని లక్ష్మీ!!

94. పలికెద పావన చరితము
పలికింపగ నీవు మధురపలుకుగ నిలిచిన్
పలికిన భవహరమగునని
పలికించెద జనుల తోడ పనిగా లక్ష్మీ!!

95. తిరముగ ఘనముగ రాజిలు
తిరుమలవాసిని భగవతి దేహీ యనగా
తిరముగ నీ దరిని నిలచి
తిరుమల యందున నుతించి తిరుగని లక్ష్మీ!!

96. రావమ్మ మా గృహమున
శ్రీవారి సమేతముగను సేవల నొందిన్
దీవించి భుజించియు మము
బ్రోవగ రారమ్మ మీరు పొలుపుగ లక్ష్మీ!!

97. జలనిధి పద్మాకరి సిరి
జలధిజ ధరణిజ ప్రభవతి సరసిజనయన
పలువిధముల సేవించుచు
కలనైన మరువను నిన్ను కవితాలక్ష్మీ!!

98. హే పద్మాక్షీ గుణనిధి
హే పద్మాకరి హరిసతి హే సిరినిలయా
హే పద్మాలయ పద్మిని
హే పద్మాసని భగవతి హితకరి లక్ష్మీ!!

99. సింహాచలమున రాజిలు
సింహుని క్రోడమున నడరు శ్రితజన పోషా
సంహారము జేసి వెతలు
సంహిత జ్ఞానము నొసగుమ సద్గుణ లక్ష్మీ!!

100. నా పలుకే యర్చనములు
నా పలుకే కీర్తనముగ నయమగు విధమున్
నా పలుకే యభిషేకము
నా పద్యమె నీ నివేదనమ్మిక లక్ష్మీ!!

101. ఛందములో పటిమ గొనియు
చందముగా తెలుగుఁ వ్రాసి శతకము నిడగా!
బంధము శాశ్వతమేర్పడ
పొందికఁ గాంచియు నను గను ముదముగ లక్ష్మీ!!

102. శ్రీహరి హృదయనివాసిని
శ్రీహరిణీ కమలవాసి శ్రీమణినిలయా
శ్రీహరి పదముల సేవిని
శ్రీహరి ధ్యానము సలిపెడి శ్రీసతి లక్ష్మీ!!

103. తిరుమణి ధరింప నిత్యము
తిరముగ మనమున నిలుచును తిరుమలపతియే
గరిమను పటిమనొసంగుచు
పరమపదమునిడును దేవి పార్థివిలక్ష్మీ!!

104. స్వర్ణ కమలముల గొనినే
స్వర్ణాలంకార జనని సమవృద్ధిగనే
స్వర్ణాభిషేకము సలిపి
పూర్ణానందమునుగొనెద పొలుపుగ లక్ష్మీ!!

105. కందము వ్రాసిననే కవి
కందము గూర్చును యందము కవులకు యనుచున్
యందరు బలుకగ వినినే
కందము వ్రాసితి నడరను కవిగా లక్ష్మీ!!

106. జయము జయము నీకు జనని
జయము జయము నీకు హరిణి జయము భగవతీ
జయము జయము నీకు విమల
జయము జయము జగపతి సతి జలధిజ లక్ష్మీ!!

107. మంగళములు నీకు విజయ
మంగళములు హరిసతి సిరి మాధవి పద్మా
మంగళములు ధరణిజ శ్రీ
రంగ సహిత మంగ దివ్య మంగళలక్ష్మీ!!

108. శరణము దరిద్రమర్దని
శరణము సురపూజిత జయ శాంబరి లక్ష్మీ
శరణము శ్రితజన పోషిణి
శరణము హరివల్లభ సిరి శరణము లక్ష్మీ!!

